

మందు మాయ



నిషేధం మాట దేవుడెరుగు..
ఐదేళ్లూ నాసి రకం మద్యం సరఫరా

- మందుబాబుల ఆరోగ్యంతోపాటు.. ఆర్థికంగా తీవ్ర నష్టం
- ఐదేళ్లలో ప్రభుత్వం దోపిడీ రూ.2,500 కోట్లు
- ఒక్కో కుటుంబంపై ఏడాదికి రూ.28 వేలు భారం

ఈ మాట గుర్తుందా జగన్ ?

మద్యం ధరలు పెంచుకుంటూ పోతాం. బార్ అండ్ రెస్టారెంట్లలోనే అందుబాబులో ఉంచుతాం. మద్యం ధరలు పెంచితే సామాన్యులు తాగడం మానేస్తారు. తద్వారా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తాం. లేదంటే మీ బిడ్డ మళ్లీ వచ్చి ఓట్లు అడగడు. నన్ను నమ్మండి.

- ఇదీ ఎన్నికల ముందు ప్రజాసంకల్ప పాదయాత్రలో ఊరూరా జగన్ ఇచ్చిన హామీ

200 ఇచ్చినా కిక్ లేదు

నేను రోజూ భీమవరం బస్టాండ్‌లో వేరుశనగ కాయలు అమ్ముతా. రోజంతా కష్టపడితే రూ.300 వస్తుంది. సాయంత్రానికి అలిసిపోయి రూ.60 ఇచ్చి మందు తాగితే కిక్ ఇచ్చేది. ఇప్పుడు రూ.200 ఇచ్చినా కిక్ రావడం లేదు. డబ్బులన్నీ మందుకు ఇచ్చేసి ఇంటికి వెళ్లిపోతున్నా. ఈసారి నేను జగన్‌ను బాగా గుర్తు పెట్టుకుంటాను.

- ఓ చిరు వ్యాపారి మాట

రేటు పెరిగింది.. ఏం చేయను

మా ఆయన సైకిళ్లు బాగు చేస్తుంటాడు. గతంలో రోజుకు రూ.500 సంపాదిస్తే రూ.100 మందు తాగి, మిగిలిన రూ.400 ఇచ్చేవాడు. ఇప్పుడు రోజుకు రూ. 300 మించి రావడం లేదు. ఆ మొత్తంతో మందుకొట్టి ఇంటికి ఉత్త చేతుల్తో వస్తున్నాడు. ఇదేమయ్యా అంటే మందు రేటు పెరిగింది. ఆదాయం తగ్గింది. ఏం చేయమంటావ్ అంటాడు. కుటుంబం నెట్టుకురావడం కష్టమవుతోంది. పిల్లలను పెంచుకోవడానికి మరో నాలుగు ఇళ్లల్లో పనులకు ఒప్పుకున్నాను.

- ఇది భీమవరంలో లక్ష్మి దీనగాథ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అనుకున్నట్టుగానే జగన్ అధికారంలోకి వచ్చారు. ఆ వెంటనే మద్యం ధరలు పెంచేశారు. ప్రభుత్వ మద్యం షాపులను ఏర్పాటుచేశారు. ఆ తర్వాత మాల్స్ నెలకొల్పారు. ఇంకా ప్రభుత్వ ఆదాయం సరిపోలేదు. టూరిజం రిసార్ట్ అభివృద్ధి పేరుతో మరికొన్ని మద్యం షాపులు తెరిచారు. క్లబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు చేపట్టారు. టూరిజం బార్‌లను ప్రారంభించారు. ఎలా వీలైతే అలా ప్రభుత్వం మద్యం అమ్మకాలను పెంచుతూపోయింది. ధరలను అమాంతం పెంచేసింది. జిల్లాలో 191 ప్రభుత్వ మద్యం షాపులున్నాయి. మరో 24 ప్రైవేటు బార్‌లు వున్నాయి. రెండు టూరిజం బార్‌లు, రెండు క్లబ్బుల్లో మద్యం అమ్మకాలు జరుగుతు న్నాయి. ప్రతిరోజు జిల్లాలో 40 వేల లీటర్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. నగదు రూపంలో రూ.3 కోట్ల విలువైన మద్యం విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోజుకు రూ.1.50 కోట్ల మేర అమ్మకాలు జరిగేవి. అప్పట్లో ధరలు తక్కువగా ఉండడంతో తక్కువ ఆదాయం వచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలను పెంచేయడంతో ఆదాయం రెట్టింపైంది. సామాన్య, మధ్య తరగతి ఇళ్లు గుల్లవుతున్నాయి.



నాసి రకం మద్యంతో ఆరోగ్యం గుల్ల

గతంలో ప్రభుత్వాలు బ్రాండెడ్ రకాలను తక్కువ ధరకు అమ్మకాలు సాగించేవి. మద్య పానప్రియుల ఆరోగ్యానికి పెద్దగా ప్రమాదం ఉండేది కాదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రకం బ్రాండ్‌లు పుట్టుకొచ్చాయి. విస్కీలో 8 పీఎం, బాగ్ టైపర్, స్టెర్లింగ్ బి 7, ఆల్ సీజన్స్, బీర్‌లు భూమ్ భూమ్, బ్రిటిష్, కేఎఫ్ ఆల్ట్రా, ఇలా అనేక రకాలను తెరమీదకు తెచ్చింది. అదంతా నాసి రకమేనంటూ మద్య ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. బ్రాండెడ్ రకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రభుత్వ మద్యం సేవిస్తే ఆరోగ్యం దెబ్బ తింటుందంటూ మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. నాసి రకం మద్యంతో ఆసుపత్రి పాలైన వారూ ఉన్నారు. మద్యం ధరలు పెరిగిపోవడంతో కరోనా సమయంలో ఆదాయం లేక కొందరు శానిటైజర్లు సేవించి ఆరోగ్యాలు పాడు చేసుకున్నారు.

ఐదేళ్లలో రూ.2,500 కోట్లు

ప్రభుత్వం ధరలు పెంచేయడంతో జిల్లాలో మద్యపానప్రియులు కోల్పోయిన మొత్తం తెలిస్తే గుండె గుభేల్‌మంటుంది. గతంలో రూ.1.50 కోట్ల నుంచి రూ.1.80 కోట్ల వరకు మద్యం అమ్మకాలు సాగేవి. ప్రతి రోజు 40 వేల లీటర్ల మద్యం అమ్ముడయ్యేది. ఇప్పుడదే మద్యంతో సగటున రూ.3 కోట్ల ఆదాయం లభిస్తోంది. అంటే ప్రభుత్వ రోజుకు ఆదాయం రెట్టింపైంది. ప్రస్తుతం ఏడాదికి మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.1,100 కోట్లు ఆదాయం వస్తోంది. గతంలో రూ.600 కోట్లు ఉండేది. ఈ లెక్కన వైసీపీ హయాంలో జిల్లాలోనే ప్రభుత్వానికి ఏడాదికి అదనంగా రూ.500 కోట్ల ఆదాయం పెరిగింది. అంటే గడచిన ఐదేళ్లలో రూ.2,500 కోట్లు ప్రభుత్వానికి అదనంగా సమకూరింది. ఆ మొత్తం భారం మద్య పానప్రియులపైనే పడింది.

కొన్ని రోజులే బ్రాండెడ్

ఏపీలో మద్యం నాసిరకంగా ఉంటోంది. ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయి. ప్రభుత్వం అమ్మకాలు చేస్తున్న మద్యాన్ని ప్రయోగశాలల్లో పరీక్షించాలంటూ నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు రెండేళ్ల క్రితం డిమాండ్ చేశారు. ఏపీ మద్యంపై కేంద్రం దృష్టి పెట్టాలి. దర్యాప్తు చేయాలంటూ కోరారు. అంతే రాష్ట్ర ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. కొద్ది రోజులపాటు నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేసింది. ఆ తర్వాత మళ్లీ మామూలే. నాసిరకం బ్రాండ్‌లే. అధిక ధరలే.

• ఏడాదికి రూ.28 వేలు భారం

గతంలో రూ.70కు క్వార్టర్ మద్యం లభించేది. ఇప్పుడు రూ.150 ఇవ్వాల్సిందే. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్వార్టర్ బాటిల్ ధర ఏకంగా రూ.120 చేశారు. ఇప్పుడది లభ్యం కావడం లేదు. కనీసం రూ.150 వెచ్చించాల్సి వస్తోంది. క్వార్టర్ మందు తీసుకునేవాడు గతంతో పోల్చుకుంటే రూ.80 అధికంగా చెల్లిస్తున్నారు. నెలకు రూ.2400. మద్యం ధరలు పెరగడం వల్ల ఏడాదికి అదనంగా రూ.28 వేలు కోల్పోతున్నారు. అంటే ఒక ఇంట్లో మద్యం సేవించే వ్యక్తి ఉంటే ఆ కుటుంబానికి ఇప్పుడు ఏడాదిలో రూ.28 వేలు భారం పడుతోంది. సంక్షేమ పథకాలు ఇస్తున్నాం అంటూ ఊదరగొడుతున్న జగన్ ప్రభుత్వం ఒక్క మద్యం రూపంలోనే దొడ్డిదారిన ఒక్కో కుటుంబం నుంచి వేలల్లో దోచేస్తోంది.

అక్కడ రూ.120.. ఇక్కడ రూ.220

కేరళలోనూ ప్రభుత్వమే మద్యం విక్రయిస్తోంది. అక్కడ బ్రాండెడ్ రకాలను క్వార్టర్ రూ.120లకు అమ్ముతున్నారు. అదే రకం మద్యం ఇక్కడైతే రూ.220 అమ్ముతున్నారు. ఇలా బ్రాండెడ్ రకాల్లోనూ ప్రభుత్వం అడ్డంగా దోచుకుంటోంది. కుటుంబాలను నాశనం చేస్తోంది. మద్యపాన నిషేధం మాట అటకెక్కించింది. మద్యంపై 25 ఏళ్ల కోసం అప్పులు తెచ్చింది. ఇదీ వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానం.

• మద్యం అమ్మకాల లెక్కలేవీ ?

మద్యం అమ్మకాల్లో ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదు. డిజిటల్ పేమెంట్‌లకు తొలుత అవకాశం లేదు. సొమ్ములు ఇస్తేనే మద్యం అమ్మడం. దీనివల్ల మద్యం అమ్మకాల్లో అవినీతి చోటు చేసుకుంటోందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నర్సాపురం పర్యటనలో ఒక మద్యం షాపును సందర్శించారు. ఎంతా అమ్మారో అడిగి తెలుసుకున్నారు. లక్ష రూపాయల విలువైన మద్యం విక్రయిస్తే రూ.7 వేలకు మాత్రమే బిల్లులు ఇచ్చారు. మిగిలిన సొమ్ములకు లెక్కలేవి అంటూ పురందేశ్వరి మండిపడి ధర్నా న్విహించారు. రహదారిపై మందు బాటిళ్లను ధ్వంసం చేసి నిరసన తెలిపారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ సాగింది. మద్యం అమ్మకాల్లో భారీ అవినీతి చోటు చేసుకుందంటూ అందరిలోనూ అనుమానాలు రేకెత్తించింది.


నరసాపురంలో పురందేశ్వరి ఫైర్ (ఫైల్)

నామినేషన్ కౌంటర్ (3వ రోజు)

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు	మూడో రోజు నామినేషన్లు	మొత్తం
నరసాపురం ఎంపీ	01	06
1.ఆచంట	00	04
2.పాలకొల్లు	01	05
3.నరసాపురం	00	02
4.భీమవరం	00	01
5.ఉండి	00	04
6.తణుకు	02	06
7.తాడేపల్లిగూడెం	01	03
మొత్తం	04	25
ఏలూరు ఎంపీ	00	03
1.ఉంగుటూరు	01	02
2.దెందులూరు	00	02
3.ఏలూరు	01	02
4.పోలవరం	01	03
5.చింతలపూడి	03	03
6.నూజివీడు	02	05
7.కైకలూరు	01	04
మొత్తం	09	21

పార్లమెంట్‌కు ఒకటి.. అసెంబ్లీకి నాలుగు

భీమవరం టౌన్, ఏప్రిల్ 20 : నరసాపురం పార్లమెంట్, దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మూడో రోజు శనివారం ఐదుగురు వ్యక్తులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎంపీ అభ్యర్థిగా జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా ఓలేటి నాగేంద్రకృష్ణ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాలకొల్లుకు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పోలిశెట్టి శివకృష్ణ, తాడేపల్లిగూడేనికి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) తరఫున మరపట్ల రాజు, తణుకుకు స్వతంత్ర అభ్యర్థులుగా సజ్జ మురళీకృష్ణ, పుప్పల కుమారి నామినేషన్లు దాఖలు చేశారు. భీమవరం, నరసాపురం, ఆచంట, ఉండి నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు.

హోం ఓటింగ్‌కు 519 మంది దరఖాస్తు

భీమవరం, ఏప్రిల్ 20: జిల్లాలో ప్రతి ఒక్క ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం తెలిపారు. '85 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ (సర్వీసు ఓటర్లు), హోం ఓటింగ్ ద్వారా ప్రత్యేక సౌకర్యం కల్పించాం. ఇప్పటి వరకు 85 ఏళ్లు పైబడిన 267 మంది, దివ్యాంగులు 262 మంది మొత్తం 519 మంది తమ ఓటు హక్కును ఇంటి వద్దే వినియోగించుకునేందుకు ఫారం-12డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు చొప్పున పోలింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఇవి వచ్చే నెల మూడు నుంచి ఏడో తేదీ వరకు పర్యటిస్తాయి. ఎన్నికల సిబ్బంది ఈ నెల 26వ తేదీలోగా ఫారం 12 పూరించి వారు పనిచేసే ప్రాంతంలో ఆర్వోకు సమర్పించాలి. వీరికి వచ్చే నెల 6 నుంచి 8 వరకు ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పిస్తాం' అని తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష

భీమవరం క్రైం, ఏప్రిల్ 20: ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఏ అధికారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వి.అజిత హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎన్నికల ఏర్పాట్లు, భద్రతపరమైన అంశాలపై శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ప్రచార సభలు, యాత్రలకు భద్రతా చర్యలకు ఆదేశాలిచ్చారు. చెక్ పోస్టుల వద్ద అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఏఎస్పీలు భీమారావు, ఏటీవీ రవికుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు పవన్ ఇక్కడే

నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, గణపవరంలలో సభలు

భీమవరం/నరసాపురం/ తాడేపలిగూడెం రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రెండు రోజులపాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్డీఏ కూటమి తరఫున జనసేన పోటీ చేసే నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారు. ఆదివారం పిఠాపురం నుంచి హెలీకాప్టర్‌లో నర్సాపురం చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటలకు ఇక్కడ బహిరంగ సభలో మాట్లాడి, రాత్రి ఏడు గంటలకు రోడ్డు మార్గంలో భీమవరం వెళతారు. అక్కడ ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిర్వహించే సభలో మాట్లాడి రాత్రికి భీమవరంలోనే బస చేస్తారు. సోమవారం భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లి, సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించే సభలో ప్రసంగిస్తారు. అనంతరం గణపవరం వెళ్లి సభలో పాల్గొంటారు. తదుపరి భీమవరం చేరుకుని రాత్రి బస చేస్తారు. మంగళవారం ఉదయం తిరిగి పిఠాపురం వెళతారు. నరసాపురం బహిరంగ సభ విజయవంతం చేయాలని ఆ పార్టీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్, పొత్తూరి రామరాజు, మేకల సతీష్ శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం బహిరంగ సభ, రూట్ మ్యాప్ తదితర అంశాలపై కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం సమీక్షించారు. సభకు భారీ సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.


తాడేపల్లిగూడెంలో పవన్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న బొలిశెట్టితో జనసేన నాయకులు

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్

భీమవరం టౌన్, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో గత ఐదేళ్లుగా విధ్వంసకర, అరాచక పాలన పాలన సాగింది. ఇక ఈ పాలనకు చరమగీతం పాడుతూ ప్రజలు విముక్త ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలని బీజేపీ రాష్ట్ర అధికార ముఖ్య ప్రతినిధి లంక దినకర్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ట్రబుల్ ఇంజన్ సర్కారు నడుస్తోంది. ఈ ఎన్నికల తర్వాత కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడుతుందని తెలిపారు. బీజేపీ నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో శనివారం బీజేపీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన జగన్ గద్దెనెక్కిన తర్వాత సంక్షేమపాలన పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. అభివృద్ధికి ఆనవాళ్లే లేవంటూ ఎద్దేవా వేశారు. ఈ నెల 23న శ్రీనివాస్ వర్మ నామినేషన్ దాఖలు చేయబోతున్నారని చెప్పారు.

బీపీటీ - 5204కు ప్రత్యామ్నాయం ఎంటీయూ 1271 రకం

పెనుమంట్ర, ఏప్రిల్ 20: బీపీటీ-5204కు ప్రత్యా మ్నాయంగా రూపొందించిన ఎంటీయూ 1271 రకాన్ని రైతులు పొలాల్లో పరిశీలించాలని ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి కోరారు. శనివారం మార్టేరు వరి పరిశోధన స్థానంలో గోదావరి మండలాల పరిశోధన-విస్తరణ సలహా మండలి సమావేశం రెండో రోజు ఆమె మాట్లాడారు. రైతులు ప్రాంతాల వారీగా అనువైన రకాలు, నీటిలభ్యత, చీడపీడలు ఆశించే అవకాశాలను బట్టి వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎన్జీ రంగా విస్తరణ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎస్ నాయకులు మాట్లా డుతూ చిరు సంచులు రకాలను (మినీ కిట్‌లు) రైతుల పొలాల్లో పరిశీలించేటప్పుడు కేవలం దిగుబడిని మాత్రమే కాకుండా మిల్లర్ల అభిప్రాయాలు, అన్నం రుచి, ఉడికే గుణం లక్షణాలను పరిశీలించాలన్నారు. 2024-25 సంవత్సరానికి పరిశోధన, విస్తరణ ప్రణాళికలను రూపొం దించారు. డాక్టర్ జె.శ్రీనివాస్, వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, శ్రీహరి, జ్యోతిర్మయి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంతి

రామరాజు భవిష్యత్‌కు చంద్రబాబు భరోసా

భీమవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు శనివారం విజయవాడలో భేటీ అయ్యారు. 'ప్రత్యేక కారణాల వల్ల ఉండి టిక్కెట్‌ను నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు ఇవ్వాల్సి వచ్చింది. ఎమ్మెల్యే అభ్యర్థి సీటు మార్పు చేయడం బాధగానే ఉంది. కానీ తప్పడం లేదు. నీ భవిష్యత్తు ఏ విధమైన డోకా లేదు. నేను చూసుకుంటాను' అంటూ చంద్రబాబు ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు.

26న షర్మిల దెందులూరు రాక

దెందులూరు, ఏప్రిల్ 20 : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 26న ఏలూరు జిల్లా దెందులూరు రానున్నట్టు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం దెందులూరులో నిర్వహించిన ప్రచారంలో వివరాలు వెల్లడించారు.



జగన్మాయ

పోలవరం పరిహాసం



పరిహారం ఇవ్వలేదు.. పునరావాసం పూర్తి కాలేదు..

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కుక్కునూరు మండల ప్రజలకు శాపంగా మారింది. ప్రాజెక్ట్ నిర్మాణంతో నిర్వాసితులైన వారికి వ్యక్తిగత పునరావాస పరిహారం, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. 41.15 కాంటూర్ లెవల్‌లో మండలంలో 8 గ్రామాలు ముంపు బారిన పడతాయని ప్రభుత్వం గుర్తించింది. భువనగిరి, గుంపెనపల్లి, గొమ్ముగూడెం నిర్వాసితులకు పునరావాస వ్యక్తిగత పరిహారం చెల్లించారు. చీరవల్లిలో 400కి పైగా నిర్వాసితులు ఉండగా ఇప్పటికి దాదాపుగా 200 మంది నిర్వాసితులకు మాత్రమే పరిహారం చెల్లించారు. కుక్కునూరు ఎ బ్లాక్, కివ్వాక, దామరచర్ల, రామచంద్రపురం నిర్వాసితులకు పరిహారం అందలేదు. నెలలు, ఏళ్ళు గడుస్తున్నా పరిహారం మాత్రం నేటికీ అందటం లేదు.

ఇప్పటి వరకు పలు గ్రామాల్లోని గిరిజనేతర నిర్వాసితులకు రూ.6.36 లక్షలు ఎస్సీ, గిరిజనులకు రూ.6.86 లక్షలు చొప్పున ఖాతాలో జమ చేశారు. ఏటా గోదావరి వరదలకు గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. అటు పరిహారం అందక.. ఇటు సౌకర్యాల లేమితో దయనీయంగా జీవితం గడుపుతున్నామని కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు గిరిజన నిర్వాసితుల ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. కట్టుకునే పరిస్థితి లేనందున వారి కోసం మర్రిపాడులో పునరావాస కాలనీలో ఇళ్లు కేటాయించాలని 60 కుటుంబాల గిరిజనులు కోరుతున్నారు.

జీలుగుమిల్లి మండలంలో పోలవరం నిర్వాసితులకు నిర్మించిన పునరావాస కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించలేదు. ముంపు పేరుతో స్వగ్రామాల నుంచి బలవంతంగా పునరావాస కాలనీలకు తరలించారు. కామయ్యపాలెం పంచాయతీ వద్ద కొత్తమామిడిగొంది గ్రామస్థులు సుమారు 50 కుటుంబాలు వచ్చాయి. హామీల అమలు ఎలా ఉన్నా కనీస వసతులు లేవు తాగునీరు లేదు, కనీసం చేతి పంపులు కూడా ఏర్పాటు చేయలేదు. కొందరికి ప్యాకేజీలో బాగంగా భూమికి భూమి కేటాయించినా సాగు నీటి సౌకర్యం లేక బీడు భూములుగా ఉన్నాయి.

పోలవరం ప్రాజెక్ట్‌కు సర్వం త్యాగం చేశాం..

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన మా గోడు ప్రభుత్వాలకు పట్టడం లేదు. ఉన్న ఫళంగా ఖాళీ చేసి పునరావాస కాలనీలకు తరలివచ్చి కూలి పనులు చేసుకుని బతకాల్సి వస్తోంది. సరైన వసతులు లేవు, కేంద్ర రాష్ట్ర బృందాలు సైతం సమస్యలు అడిగి వెళ్లడం తప్ప తమకు చేసింది ఏమీ లేదు. అధికారులు మారుతున్నపుడల్లా సమస్యలు తెలుపుతూ ఆర్డీవో, కలెక్టర్లకు వినతులు ఇస్తూ వస్తున్నాం.

జల్లేరు పేరుతో నిండా ముంచారు

పి.నారాయణపురం, పి.అంకంపాలెం పాకలగూడెం గ్రామాల సమీపంలో జల్లేరు ముంపు రిజర్వాయరు ఏర్పాటు నిమిత్తం టీడీపీ ప్రభుత్వ హయాంలో భూసేకరణ చేశారు. ఆయా గ్రామాల వ్యవసాయ భూములకు అప్పట్లో నష్టపరిహారం చెల్లించారు. పొలాల్లో చెట్లకు పరిహారం, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించలేదు. పరిహారం చెల్లిస్తే ఈ ప్రాంతం వదిలి వెళ్లిపోదామని ఐదేళ్లుగా గిరిజనులు ఎదురుచూస్తున్నారు.





రూ. 10 లక్షల పరిహారం?

ప్రతి నిర్వాసితుడికి కేంద్రంతో సంబంధం లేకుండా పునరావాస పరిహారం రూ.10 లక్షలు ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కేంద్రం నిధులు ఇస్తేనే పరిహారం చెల్లిస్తామని.. అంతా దేవుని దయ అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపు గ్రామాల్లో పిల్లలకు పెళ్లిళ్లు చేయలేకపోతున్నారు. పరిహారం రాగానే సొమ్ము ఇస్తామని పలువురు ఆడపిల్లల వివాహాలు చేశారు. కాలం గడుస్తున్నా పరిహారం అందక కుటుంబాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. చదువుకున్న వారు గ్రామం విడిచి వెళితే పరిహారం అర్హత కోల్పోతామని కూలీలయ్యారు.


కివ్వాక పునరావాస కాలనీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విస్తీర్ణంలో అతి పెద్ద నియోజకవర్గం పోలవరం. బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, పోలవరం మండలాలతో పాటు తెలంగాణ నుంచి ఏపీలో విలీనమైన వేలేరుపాడు, కుక్కునూరు మొత్తం 7 మండలాలతో అతి పెద్ద నియోజకవర్గం. సమస్యలు కూడా అధికం. ప్రతిపక్ష నాయకుడిగా జగన్ ఇచ్చిన హామీలు అత్యంత ఘనం. ముంపు గ్రామాల నిర్వాసితులు గంపెడాశతో ఐదేళ్లు ఎదురు చూశారు. సీఎంగా జగన్ అతి పెద్ద మోసం చేశారని పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కునూరు, కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి


కొత్త మామిడిగొంది నిర్వాసిత కాలనీ

అదనపు పరిహారం ఏదీ..?



గత ఎన్నికల సమయంలో జగన్ ప్రతిపక్ష హోదాలో పర్యటించినప్పుడు మన ప్రభుత్వం రాగానే నిర్వాసితులకు అదనపు పరిహారం అన్నారు. గతంలో తన తండ్రి ఇచ్చిన ఎకరాకు రు.1.15 లక్షల పరిహారానికి అదనంగా రూ.3.50 లక్షలు ఇస్తానన్నారు. ఐదేళ్లు గడిచినా హామీ అమలు కాలేదు.

సమస్యలు.. హామీలు

- కొయ్యలగూడెం మండలంలో డిగ్రీ కాలేజీ, ఫైర్ స్టేషన్ ఏర్పాటు ఎన్నికల హామీలుగానే మిగిలాయి.
- కొయ్యలగూడెం - కన్నాపురం, పొంగుటూరు - యర్నగూడెం రహదారులు అధ్వానం. కన్నాపురం - పోలవరం వెళ్ళే రహదారిలో తూర్పుకాల్వ, కన్నాపురం - బుట్టాయిగూడెం రహదారిలోని పడమటి కాల్వపై వంతెన లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం, వరదల సమయంలో ప్రయాణాలు నిలిచిపోవాల్సిందే.
- కొయ్యలగూడెంలో మార్కెట్ కమిటీ గోదాములు శిథిలావస్థకు చేరాయి. రైతులకు కనీస సౌకర్యాలు లేవు. తుప్పలు, ముళ్ళచెట్లతో మార్కెట్‌యార్డు నిండిపోవడంతో పాములకు నిలయంగా మార్కెట్ యార్డు తయారైంది.
- కుక్కునూరు - భద్రాచలం 40 కి.మీ రహదారి అధ్వానంగా మారింది. రెండేళ్లుగా మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు నరకయాతన పడుతున్నారు.
- రెవెన్యూ వెబ్ ల్యాండ్ ఓపెన్ చేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారసత్వ భూముల పంపిణీ, అమ్మకాలు నిలిచి పోయాయి. ముంపులో లేని భూములకు వారసత్వ మ్యుటేషన్ జరగక పోవడంతో బ్యాంక్ రుణాలు అందని పరిస్థితి ఏర్పడింది.
- పోలవరం - గుంజవరం, వింజరం తానాలకుంట - ముత్యాలరావుపేట, దొండపూడి - పేద్రాల రహదారుల నిర్మాణ హామీ అమలు కాలేదు.
- గుంజవరం - ఇటుకలకోట మార్గంలో కల్వర్టు, తానాలకుంట కల్వర్టు కొండవాగుల ధాటికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. కనీసం మరమ్మతు కూడా చేయలేదు. ఎల్ఎన్‌డీ పేట పంచాయతీ సరిపల్లికుంట, రామనరసాపురం మార్గంలో కొట్టుకుపోయిన 3 కల్వర్టులు, వింజరం నుంచి మెత్తప్పకోట, సున్నాలగండి, ఉడతపల్లి గ్రామాలకు వెళ్ళే రోడ్డు మార్గంలో రెండు కల్వర్టుల నిర్మాణంలో బినామీ కాంట్రాక్టులతో వైసీపీ నేత సొమ్ములు స్వాహా చేశారని ఆరోపణలు.
- గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఎల్ఎన్‌డీపేట పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం కావడంతో మురుగు రోడ్లపై చేరుతోంది.
- జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.5 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం తలపెట్టారు. వైసీపీ అధికారంలోకి రాగా స్టేడియం నిర్మాణం నిలిచిపోయింది.
- జీలుగుమిల్లి - పి.రాజవరం రహదారి అధ్వానం కావడంతో టి.నరసాపురం, చింతలపూడి, ఏలూరు వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి జీలుగుమిల్లి వాగు పొంగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల కొద్ది మీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు.
- జీలుగుమిల్లిలో పోలీస్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యాలయం నిర్వహణకు తగిన భవనం లేక ఏడాది క్రితం పాడైన పారెస్టు శాఖ క్వార్టర్‌ను మరమ్మతు చేసి కార్యాలయంగా వాడుతున్నారు.
- బుట్టాయగూడెం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దొరమామిడి పీహెచ్‌సీ భవన నిర్మాణాలు నిలిచిపోయాయి.

నెక్లెస్ బండ్.. శాపం

పోలవరం గ్రామానికి రక్షణగా నిర్మించిన నెక్లెస్ బండ్ ప్రణాళిక అధికారుల అంచనా వ్యయం రూ.12 కోట్లు కాగా ఇప్పటి వరకు 14 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. పనులు మాత్రం పూర్తి కాలేదు. 3.5 కిలో మీటర్ల మేర నెక్లెస్ బండ్ చేపట్టాలి. కేవలం 1.5 కిలోమీటర్లు పనులు చేశారు. వరదల సీజనుకి పోలవరం ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవలసిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెక్లెస్ బండ్, స్పిల్‌వే నిర్మాణంతో గోదావరి తీరం వైపు ఇసుక తిన్నెలు కొట్టుకుపోయి లంక భూములు కొట్టుకుపోయి నది రేవులు ప్రమాదకరంగా మారాయి.



అప్పుడు ఎర్రిపప్ప ఇప్పుడు నీ...!!

మంత్రి గారి నోటి దురుసు



తణుకు వైసీపీ అభ్యర్థి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మరోసారి నోరు జారారు. ఇరగవరం మండలంలో ప్రచారానికి వెళుతున్న మంత్రి కారుమూరి గోటేరులో రోడ్డు పక్కన ధాన్యాన్ని సంచులకు ఎత్తుకుంటున్న రైతులను చూసి కారు దిగారు. తలకు పాగా కట్టుకుని రైతుల వద్దకు చేరారు. పంట ఎలా పండింది. ఎలా విక్రయిస్తున్నారు అంటూ రైతులను అడిగారు. ఈ క్రమంలో పక్కన కూర్చున్న రైతు మంత్రికి కాస్తదూరంగా జరిగారు. దాంతో మంత్రి నీ య.. రా.. నేనూ కష్టపడిన వాణ్ణే అంటూ మాట తూలారు. నీ య.. అంటూ సంబోధించడంపై ఇప్పుడంతా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ధాన్యం గింజలు మొక్క మొలుస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన రైతును ఎర్రిపప్పా అని సంబోధించారు. తర్వాత ఎర్రిపప్పా అంటే బుజ్జి కన్నా అంటూ సమర్థించుకున్నారు. ఇప్పుడు నీ య.. అంటే ఏమిటి మంత్రి గారూ అంటూ జనం సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.

- ఇరగవరం



13న పోలింగ్.. దుకాణాలకు సెలవు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఆరోజు కార్మికశాఖ ఆంధ్ర ప్రదేశ్ దుకాణముల, సంస్థల చట్టం (1988) ప్రకారం దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఏదైనా వ్యాపారం, వాణిజ్యం, పారిశ్రామిక సంస్థ, ఏదైనా ఇతర సంస్థలలో ఉద్యోగం చేస్తున్న ప్రతి వ్యక్తి, శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో ఓటు వేయడానికి అర్హులైన అందరికీ పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. అందరూ దీనిని తప్పనిసరిగా పాటించవలసినదిగా కోరారు. ఏ యజమాని అయినా ఈ నిబంధనను ఉల్లంఘించి వారి వద్ద ఉద్యోగులకు ఓటే వేసే అవకాశం కలిగించకుంటే జరిమానా, శిక్ష తప్పవని ఆయన తెలియజేశారు. ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలన్నారు.

- భీమవరం టౌన్

వాళ్లిద్దరికీ మధ్యంతరంగా..

మంత్రి పదవిపోయింది


కనుమూరి బాపిరాజు


కామినేని శ్రీనివాస్

» అవినీతి ఆరోపణలతో కనుమూరి బాపిరాజు » పొత్తు విఫలమై కామినేని శ్రీనివాస్

» కైకలూరు నియోజకవర్గానికి రెండు పర్యాయాలు మంత్రి పదవులు.. రెండ సార్లూ పదవి కోల్పోయారు

ఎన్నికల్లో ప్రజల తీర్పుతో గెలుపోటములు సాధారణం.. గెలిచిన తర్వాత వచ్చే పదవులు పార్టీ నిర్ణయమే. కైకలూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం రెండు పర్యాయాలు ఇక్కడి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కాయి. అయిదే రెండు మార్లు కూడా ఆ మంత్రులు పదవీకాలం పూర్తి కాకముందే పదవులకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కైకలూరు నియోజకవర్గంలో ఒకరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొగా మరొకరు పొత్తులు విడిపోవడంతో తమ మంత్రి పదవులను కోల్పోవలసివచ్చింది. కైకలూరు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయ ప్రవేశం చేసిన కనుమూరి బాపిరాజు 1978లో కైకలూరు అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ఆయన మరో మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరపున పోటి చేసి గెలుపొందారు. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని చేజిక్కుంచుకున్న ఇక్కడ కనుమూరి బాపిరాజు కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. 1985, 1989లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ తరపున కనుమూరి బాపిరాజు గెలుపొందారు. 1989లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేజిక్కుచుకుంది. ఆ సమయంలో ముగ్గురు ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పరిపాలించారు. మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రులుగా కొనసాగారు. కైకలూరు నుంచి కనుమూరి బాపిరాజుకు మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి పదవి చేపట్టారు. తర్వాత కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కనుమూరి ఎక్సైజ్ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు. ఆయనపై డిస్టలరీల కుంభకోణం ఆరోపణలతో మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి 1992లో రాజీనామా చేశారు. అనంతరం 1993లో జరిగిన ఉప ఎన్నికల్లో బాపిరాజుకు అసెంబ్లీ టిక్కెట్టు రాకపోవడంతో కైకలూరులో కనుమూరి రాజకీయ జీవితం కనుమరుగైంది.

తర్వాత జరిగిన ఎన్నికల్లో ఒకసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందగా మిగిలిన పర్యాయాలు గెలిచిన అభ్యర్థులు ప్రతిపక్షానికే పరిమితమయ్యారు. 2014లో తెలుగుదేశం, బీజేపీ పొత్తులో భాగంగా కైకలూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ గెలుపొందారు. చంద్రబాబు ప్రభుత్వంలో కామినేని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. మూడున్నర సంవత్సరాల కాలం పాటు మంత్రి పదవిలో కొనసాగారు. చంద్రబాబు ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగడంతో కామినేని తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

- కైకలూరు

ఓటు వజ్రాయుధం



ఆర్అండ్‌బి కార్యాలయం వద్ద ఓటుపై అవగాహనా ఫ్లెక్సీ

నియోజకవర్గాల్లో వేలాది ఫ్లెక్సీ బోర్డులు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. ఓటు విలువ తెలియజేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓటు వేయడం బాధ్యత అని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల్లో అక్రమాలపై ఆరా తీస్తున్నారు. అక్రమాలు గుర్తిస్తే సి విజిల్ యాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా వేలాది ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. రాష్ట్రఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిపై 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఓటు వేయడం మన హక్కు.. యువత మేల్కొనండి, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు వినియోగించుకోవాలని ముద్రించారు.

- ఏలూరు రూరల్



ఎవరూ ఇలా రావద్దు!



సాధారణ ఎన్నికల వేళ తణుకు మండలం, ఇతర ప్రాంతాల ప్రజలకు సైతం పెద్ద కష్టమే వచ్చింది. ఎన్నికల నిబంధనలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. తణుకు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోనే సబ్ ట్రెజరీ, రిజిస్ట్రేషన్ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మండల వ్యవసాయాధికారి, అగ్నిమాపక శాఖ, మండల పరిషత్ కార్యాలయాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. దీనితో రిటర్నింగ్ కార్యాలయానికి వంద మీటర్ల లోపు ఎవరినీ లోపలికి అనుమతించరాదని ఎన్నికల నిబంధన. దీనితో ప్రధాన రహదారి నుంచి కార్యాలయ ప్రాంగణాల ముఖద్వారం వద్ద బారికేడ్లు, పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. ఎవరిని లోపలికి అనుమతించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చి పెట్టే రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలకు ఆటంకం కలుగుతోంది. కక్షిదారులు రాక ఆదాయం కూడా పడిపోయింది. తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ కార్యాలయాల్లో వివిధ పనులు నిమిత్తం వచ్చే వారికీ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సి ఉంది.

- తణుకు

ఆ రోజు.. రావాలి మరి!

సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ ఘట్టం కొనసాగుతోంది. గ్రామాల్లో టీడీపీ, వైసీపీ నాయకులతో పాటు పార్టీ అధినాయకులతో కూడా ప్రచారం చేస్తున్నారు. గ్రామస్థాయి నాయకులు తమకు ఇష్టం ఉన్న పార్టీలో చేరుతున్నారు. ఓటర్లను కలసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. ఓటు ఉన్నా గ్రామాంతరం వెళ్లిన వారి ఓట్లు ఎలా అడగాలి. ఏలూరు రూరల్ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో బతుకుతెరువు కోసం వలస వెళ్లిన కూలీలపై వైసీపీ, టీడీపీ నాయకులు ఆరా తీస్తున్నారు. ఎంతమంది కూలీలు వలసవెళ్లారు. ఏ ప్రాంతానికి వెళ్లారు. ఎక్కడ ఉన్నారు? ఎప్పుడు వస్తారు? అక్కడ వారికి రోజు ఎంత కూలీ ఇస్తున్నారని తమ అనుచరులతో సమాచారం తెలుసుకుంటున్నారు. హైదరాబాద్, గుంటూరు, రాయచూరు, రాజంపేట, రాజమండ్రి తదితర ప్రాంతాలకు కూలి పనులకు పెద్ద సంఖ్యలో వలస వెళ్లారు. ఉగాదికి వచ్చి మళ్లీ తాము పనులు చేసే ప్రాంతాలకే వెళతారు. ఈ నెలాఖరులో పెండ్లి ముహూర్తాలు 25న కావడంతో కొందరు తమ బంధువుల వివాహాలకు వచ్చి వెళ్లాలని చూస్తున్నారు. అయితే వలసవెళ్ళిన వారితో ఆయా గ్రామాల నాయకులు ఫోన్‌లో మాట్లాడి విషయం తెలుసుకుంటున్నారు. పోలింగ్ రోజుకు రెండు రోజులు ముందు గ్రామానికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ మంది వలస వెళ్లినట్లు తెలుస్తోంది.



- ఏలూరు రూరల్

ఐవీఆర్ఎస్.. ప్రచార హోరు..



ప్రస్తుతం ప్రచారంలో టెక్నాలజీదే హవా. ఇప్పుడు అందిరి చేతుల్లోనూ ఫోన్లు ఉంటున్నాయి.ప్రధాన పార్టీలు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రచారం చేస్తున్నాయి. పార్టీ ప్రచార పాటలతో హోరెత్తిస్తున్నారు. తమకే ఎందుకు ఓటు వేయాలనే కోణాల్లో వివరిస్తున్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై యువత సరదాగా పందాలు కూడా కాస్తున్నారు. రోజుకు ఏ పార్టీ ఫోన్‌లు ఎన్ని వస్తాయో అని లెక్కలేసుకుని పందాలు కాసుకోవడం గమనార్హం. -తాడేపల్లిగూడెం రూరల్

ఎట్టెట్టా..!

పక్క నియోజకవర్గం నుంచి వచ్చి మంత్రులయ్యారు !



ఆచంట నియోజకవర్గం గతంలో ఎస్సీ నియోజకవర్గంగా ఉండేది. తరువాత నియోజకవర్గాల పునర్విభజన సమయంలో ఆచంటను జనరల్‌గా కేటాయించారు. ఆచంట పక్కనే ఉన్న పెనుగొండ నియోజకవర్గం రద్దు కావడంతో అప్పటి వరకు పెనుగొండలో పోటీ చేసిన పితాని సత్యనారాయణ ఆచంట వచ్చి పోటీ చేశారు.పితాని సత్యనారాయణ కాంగ్రెస్, టీడీపీ అభ్యర్థులుగా రెండు సార్లు విజయం సాధించి రెండు సార్లు కూడా మంత్రి పదవులు దక్కించుకున్నారు. అలాగే అత్తిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు కూడా మొన్న జరిగిన ఎన్నికల్లో ఆచంట నుంచి పోటీ చేసి ఆయన కూడా మంత్రి పదవి దక్కించుకున్నారు.

సెంటిమెంట్

దొంగరావిపాలెం.. ఈశాన్యం సెంటిమెంట్



ఆచంట నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆ గ్రామం నుంచే ప్రచారం ప్రారంభిస్తారు. పెనుగొండ మండలం దొంగరావిపాలెం గ్రామం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉండడంతో అభ్యర్థులు సెంటిమెంట్‌గా ఆ.గ్రామం నుంచే ప్రచారం ప్రారంభించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తున్నది. ప్రస్తుత ప్రధాన పార్టీ అభ్యర్థులు అయిన పితాని సత్యనారాయణ, చెరుకువాడ శ్రీరంగనాథరాజులు ఈ గ్రామం నుంచే తమ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దీంతో దొంగరావిపాలెంను అభ్యర్థుల ప్రచారానికి సెంటిమెంటు గ్రామంగా పిలుస్తారు.

- ఆచంట

ఇదీ సంగతి !

అభ్యర్థుల పొదుపు మంత్రం



సాధారణంగా ఎన్నికలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఒకపక్క ప్రచారం కోసం పార్టీ జెండాలు, టోపీలు మద్దతుదారులకు భోజన సదుపాయం.. ఇలా భారీగా ఖర్చు అయ్యేది. కానీ ప్రస్తుతం ప్రధాన పార్టీ నాయకులు సొమ్ములు ఆచి తూచి ఖర్చు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనే పక్షం రోజుల వరకూ ఎన్నికల హడావుడి కనిపించేది. అనుచరుల కోసం, పార్టీ కార్యకర్తల కోసం పక్షం రోజులు భోజనాలు వండి వడ్డించేవారు. అలాంటిది తాజాగా ఏపార్టీ శిబిరం లోనూ ఈ తరహా భోజనాల హడావుడి కనిపించడం లేదు. అభ్యర్థుల పొదుపు మంత్రానికి ఎన్నికల సంఘం జమా ఖర్చులు కూడా ఓ కారణంగా కనిపిస్తోంది.

- తాడేపల్లిగూడెం రూరల్

గోదావరి తీరాన పచ్చని పొలాలు మధ్య కాలుష్యానికి దూరంగా ఉన్నదే ఆచంట నియోజకవర్గం. చుట్టూ ఎటు చూసినా పచ్చని పంట పొలాలే. వశిష్ట గోదావరి తీరాన పచ్చటి పొలాలు..గలగలపారే గోదావరి సోయగాలు..లంక గ్రామాలతో పూర్తి గ్రామీణ నేపథ్యం కలిగిన నియోజకవర్గం ఆచంట. పట్టణాలకు దూరంగా చిన్న చిన్న గ్రామాలుగా నాలుగు మండలాలతో కలిసి ఉంటుంది. అటు ఆధ్యాత్మికంగా , ఇటు వాణిజ్యపరంగా, క్రీడా పరంగా ఒక్కో మండలం ఒక్కో ప్రత్యేకత కలిగి ఉంది. నియోజకవర్గంలో మొత్తం లక్షా 78 వేల 667 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 88 వేల 319 మంది , మహిళలు 90 వేల 348 మంది ఉన్నారు.

- ఆచంట

ఫ్లాష్ బ్యాక్

ఆచంట.. అందరిదీ !



నియోజకవర్గంలో ఓటర్లు

మొత్తం ఓటర్లు : 1,78,667
పురుషులు : 88,319
మహిళలు : 90,348
పోలింగ్ కేంద్రాలు : 187
పెనుమంట్ర 53, పెనుగొండ 57, ఆచంట 50, పోడూరు 27

1962లో నియోజకవర్గం ఏర్పాటు
రాజకీయంగా చైతన్యం
ప్రసిద్ధ ఆలయాలకు నిలయం
బాస్కెట్ బాల్ కేరాఫ్ మార్టేరు



ఆరంభం నుంచి రాజకీయంగా చైతన్యం కలిగిన నియోజకవర్గం ఆచంట. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు కాంగ్రెస్ కంచుకోటగా ఉంటే ఒక్క ఆచంట మాత్రం భిన్నంగా ఉండేది. ఒక్కొక్క సారి ఒక్కొక్క పార్టీకి విజయం ఇచ్చేది. గతంలో కమ్యూనిస్టులకు కంచుకోటగా ప్రజా ఉద్యమాలకు పురిటిగడ్డగా రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గంగా ఆచంటకు రాష్ట్రంలో ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరగ్గా మూడు పార్టీలకు సమాన విజయాలను అందించే ఇక్కడి ఓటర్లు తమ విలక్షతను చాటుకున్నారు. 47 సంవత్సరాలు పాటు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా కొనసాగి 2009 నుంచి జనరల్‌గా మారింది. ఆచంట నియోజకవర్గంలో 1962 నుంచి 13 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇపుడు 14వ సారి ఎన్నికలు జరుగుతున్నాయి.

అటూ..ఇటూ ఆధ్యాత్మిక క్షేత్రాలు


ఆచంటేశ్వర స్వామి

గోదావరికి అటు తూర్పుగోదావరి, ఇటు పశ్చిమ గోదావరి నాలుగు మండలాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా అలరారుతోంది. పెనుగొండలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాత ఆలయం, 90 అడుగుల వాసవీమాత పంచలోహ విగ్రహంతో ఈ ప్రాంతం క్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. ఆచంలో జైనుల ఇష్ట దైవం అయిన శ్వేతాంబర్ జైన్ దేవాలయం, ఆచంటలోని రామేశ్వరస్వామి, గోదావరి సమీపంలో పెదమల్లంలో మాచే నమ్మ ఆలయం పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరం, జుత్తిగ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయాలు క్షేత్రాలుగా విలసిల్లు తున్నాయి. ఇక మార్టేరు క్రీడాకారులకు పెట్టింది పేరు. నేటికి జాతీయస్థాయి ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభ చాటుకున్నారు. 1926లో జిల్లా గెజిట్ ప్రకారం ఏలూరు తరువాత రెండో వాణిజ్య కేంద్రంగా పెనుగొండ ప్రాధాన్యం సంతరించుకుంది. నెగ్గిపూడిలో వరి పరిశోధనా కేంద్రం అంతర్జాతీయ కేంద్రంగా పేరు గడించింది.

కీలకమైన నియోజకవర్గం

జిల్లాలో ఆచంట నియోజకవర్గం ఎంతో కీలకమైనది. టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారు. 1985లో జరిగిన ఎన్నికల పొత్తులో భాగంగా ఆచంటను సీపీఎంకు కేటాయించగా విజయం సాధించింది. 1989, 1994లో కూడా వామ పక్షాలకు సీటును కేటాయించగా కాంగ్రెస్‌పై విజయం సాధించారు. తరువాత వామ పక్షాలతో పొత్తు లేకపోవడంతో టీడీపీ సొంతంగా అభ్యర్థిని రంగంలోకి దింపింది. ఆచంట ఎస్సీ రిజర్వుడు కావడంతో అప్పట్లో మోచర్ల జోహర్‌వతిని టీడీపీ తరుపున రంగంలోకి దింపగా మెజారిటీతో విజయం సాధించారు.
అప్పటి నుంచి 2009లో జరిగిన ఎన్నికల్లో మినహా టీడీపీ తన పొత్తును నిలుపుకుంది.

ఆరంభంలో ఎస్సీ నియోజకవర్గం

పూర్వం ఎస్సీ నియోజకవర్గం కావడంతో అప్పట్లో ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాలతో కలిసి నియోజకవర్గంగా ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో ఆచంట మండలంతో పాటు పెనుగొండ , పెనుమంట్ర, మండలాలు వచ్చి చేరాయి. దీంతో ఆచంట నియోజకవర్గం ఆచంట మండలంతో పాటు పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల నాలుగు మండలాలతో ఉంది. ప్రస్తుతం జనరల్ స్థానంగా కొనసాగుతుంది.

టీడీపీ-సీపీఎం పొత్తులో ఏడు సార్లు విజయం

1983 టీడీపీ ఆవిర్భావం నుంచి ఆచంట నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 4 సార్లు టీడీపీ, టీడీపీ పొత్తుతో 3 సార్లు సీపీఎం అభ్యర్థులు విజయం సాధించడంతో ఒక సారి కాంగ్రెస్ , ఇంకొక సారి వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. 1983లో టీడీపీ ఆవిర్భావం జరిగిన ఎన్నికల్లో కోట బాస్కరరావు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తమ సమీప కాంగ్రెస్ అభ్యర్థి ధనరాజుపై ఏకంగా 32,467 ఓట్లతో విజయం సాధించారు. 1985లో సీపీఎం అభ్యర్థిగా అలుగు చిత్తరంజన్, 1989లో సీపీఎం అభ్యర్థిగా దిగుపాటి రాజగోపాల్ విజయం సాధించగా 1989లో మోచర్ల జవహర్‌వతి టీడీపీ అభ్యర్థిగా , 2004లో పీతల సుజాత విజయం సాధించారు. 2009లో పితాని సత్యనారాయణ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. తరువాత పితాని సత్యనారాయణ కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరి 2014లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. తరువాత 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణపై 12,886 ఓట్లతో విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం తరువాత 9 సార్లు ఎన్నికలు జరగ్గా టీడీపీ, సీపీఎం పొత్తుతో ఏడు సార్లు విజయం సాధించగా ఒక సారి కాంగ్రెస్, ఇంకొసారి వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
1962	పి.శ్యామ్ సుందరరావు	సీపీఐ	25,306	డి.పెరుమాళ్లు	కాంగ్రెస్	22,781
1967	దాసరి పెరుమాళ్ళు	కాంగ్రెస్	31,630	దిగుపాటి సుందరరాజు	సీపీఎం	23,925
1972	జి.వెంకన్న	కాంగ్రెస్	30,783	జి.సుందరరాజు	సీపీఎం	25,853
1978	కోట ధనరాజు	కాంగ్రెస్(ఐ)	39,504	జి.సుందరరాజు	సీపీఎం	21,622
1983	కె. భాస్కరరావు	టీడీపీ	45,631	కె.ధనరాజు	కాంగ్రెస్	17,264
1985	ఎ.చిత్తరంజన్	సీపీఎం	51,016	కామిడి అంబుజి	కాంగ్రెస్	19,294
1989	డి.రాజ్‌గోపాల్	సీపీఎం	46,641	కె.భాస్కరరావు	కాంగ్రెస్	38,242
1994	డి.రాజ్‌గోపాల్	సీపీఎం	53,510	బుంగా సారధి	కాంగ్రెస్	30,872
1999	మోచర్ల జోహర్‌వతి	టీడీపీ	52,954	బుంగా సారధి	కాంగ్రెస్	30,227
2004	పీతల సుజాత	టీడీపీ	46,670	చెల్లం ఆనంద ప్రకాష్	కాంగ్రెస్	41,029
2009	పితాని సత్యనారాయణ	కాంగ్రెస్	54,903	కె.రాధాకృష్ణారెడ్డి	టీడీపీ	39,148
2014	పితాని సత్యనారాయణ	టీడీపీ	63,549	ఎం.ప్రసాదరాజు	వైసీపీ	59,629
2019	చెరుకువాడ శ్రీరంగనాథరాజు	వైసీపీ	66,494	పితాని సత్యనారాయణ	టీడీపీ	53,608


మార్టేరు వరి పరిశోధన కేంద్రం

ఎన్నికల తనిఖీలు..రూ.3.36 లక్షలు స్వాధీనం


కొత్తూరు చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కామవరపుకోట, /ఉంగుటూరు, ఏప్రిల్ 20 :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తూరు ఎన్నికల చెకోపోస్టు వద్ద రాకపోకలు సాగించే వాహనాలను శనివారం తనిఖీలు చేయగా ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకు వెళతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రెండు లక్షల 53 వేల రూపాయలు స్వాధీనం చేసు కున్నట్లు చెకోపోస్టు అధికారి ఎండీ మొహిద్దీన్ తెలిపారు. తాడిచెర్ల గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి లక్షా 13 వేలు, జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్ల గూడేనికి చెందిన వ్యక్తి నుంచి లక్షా 40 వేలు స్వాధీనం చేసుకుని ఎన్నికల ట్రెజరీకు జమ చేశామన్నారు. తనిఖీలలో హెచ్‌సీ కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యా రావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, సుధీర్ తదితరులు ఉన్నారు. ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి ఫ్లైయింగ్ స్క్వాడ్ తని ఖీలలో అనమతి లేని రూ.88 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

20-04-2024
పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	266	226	238.16
జంగారెడ్డిగూడెం-1	266	235	249.64
జంగారెడ్డిగూడెం-2	266	235	250.90
కొయ్యలగూడెం	263	235	249.22
గోపాలపురం	266	235	248.41

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

గ్యాస్ట్రిక్ తగ్గుటకు
పథ్యము అవసరం లేదు ఎంతటి జఠిలమైన గ్యాస్ట్రిక్-అసిడిటీ అయినా శాశ్వతంగా నివారణ అగును. సంప్రదించండి. సెల్: 9866238384
AJD :177421

ప్లాట్లు కొనబడును
★ హైదరాబాద్, హయత్‌నగర్, అంబర్పేట్, కోహెడ, మెట్టు, మల్కాపూర్, తూప్రాన్‌పేట్ పసుమాముల, విలేజ్‌లో ప్లాట్లు కొనబడును.
సంప్ర: 9346307356
AJH-002360

దాబా ఇల్లు అమ్మకం
జంగారెడ్డిగూడెం సుబ్బారెడ్డి కాలనీ, ప్రతిభ కాన్వెంట్ వెనుకవీధిలో 400 చ.గస్థలంలో E/F రెండంతస్తుల దాబా ఇల్లు అమ్మకానికి కలదు., కాంటాక్ట్ నెం: 9441037735.
Ajd:177177

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారించి క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్‌లకు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ



ఇంటి నుంచే ఓటేయండి

హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జేసీ లావణ్య

పెదవేగి, ఏప్రిల్ 20 : పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేనివారు హోమ్ ఓటింగ్ అవకాశాన్ని వినియోగించుకోవాలని దెందులూరు ఎన్నికల అధికారిణి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి.లావణ్యవేణి సూచించారు. హోమ్ ఓటింగ్ విధానంపై ఆమె పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని 85 ఏళ్ల దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, నడవలేని పరిస్థితిలో ఉన్న వారికోసం ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ విధానాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ విధానంలో ఇంటివద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉందని, దీనికోసం అర్హులైన ఓటర్లు ఫారం - 12(డి) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫారం- 12(డి)ను సంబంధిత పోలింగ్ బూత్‌స్థాయి అధికారి/తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తును ఈనెల 23వ తేదీలోగా తిరిగి అక్కడే అందించాలని ఆమె సూచించారు. ఆ దరఖాస్తును సహాయ ఎన్నికల అధికారులు పరిశీలించి, అర్హత ఆధారంగా వచ్చేనెల రెండో తేదీ నుంచి ఐదో తేదీ మధ్య ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ఇంటివద్ద ఓటుహక్కు వినియోగించుకునే వెసులు బాటును కల్పిస్తారన్నారు. ఈ హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఎన్నికల ప్రిసైడింగ్, ఇతర ఎన్నికల అధికారులు, మైక్రో అబ్జర్వర్, బీఎల్వోలు, సెక్టార్ అధికారులు, పార్టీల ఏజెంట్ల సమక్షంలో వీడియోగ్రఫీ ద్వారా జరుగుతుందని వివరించారు.



• సైకిలెక్కిన ఆరిమిల్లి దంపతులు

అభ్యర్థులు వినూత్న రీతుల్లో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. తణుకులో ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసీ పసుపు సైకిల్ ఎక్కి ప్రచారం నిర్వహించారు. ఆరిమిల్లి సైకిల్ తొక్కుతుండగా వెనుక ఆయన సతీమణి కూర్చుని సైకిల్ గుర్తు చూపిస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

• తండ్రికి మద్దతుగా కూతురు

దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేనికి మద్దతుగా ఆమె కుమార్తె నవ్య ప్రచారం రంగంలోకి దిగింది. అవినీతికి అడ్డాగా మారిన వైసీపీని చిత్తుగా ఓడించి అభివృద్ధికి చిరునామా అయిన కూటమిని గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. శనివారం చల్ల చింతలపూడిలో టీడీపీ నాయకుడు కమ్మ శివ రామకృష్ణతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై కర పత్రాలను పంచారు.

- తణుకు , దెందులూరు

ఎన్నికల సిత్రాలు



పదే పదే అవే హామీలు

50 ఏళ్లుగా ఇదే తంతు !



నరసాపురం, ఏప్రిల్ 20: నరసాపురం నియోజకవర్గ ఓటర్లు 50 ఏళ్లుగా ప్రధాన పార్టీలు ఇస్తున్న హామీలను నమ్మి నమ్మి విసుపోయారు. ఇక్కడ ప్రధాన సమస్యలు రెండే రెండు..ఒకటి వశిష్ఠ వారధి, మరొకటి బియ్యపు తిప్ప హార్బర్. ప్రతి ఎన్నికల్లోనూ అన్ని పార్టీలు ఈ రెండు సమస్యలపైనే హామీలు గుప్పిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వీటిని నిర్మిస్తామని శపథం చేస్తుంటాయి. కానీ ఐదేళ్ల పూర్తయినా.. ఇవి మాత్రం నేరవేరడం లేదు. వారధి నిర్మాణానికి గడిచిన 40 ఏళ్ళల్లో ముగ్గురు సీఎంలు శంకుస్థాపన చేశారు. ఇటు హార్బర్ పనులకు ఒక ముఖ్యమంత్రి, మరో కేంద్ర మంత్రి, రాష్ట్రమంత్రులు శంకుస్థాపనలు చేశారు. అయినా ఈ రెండు పనులు పూర్తికాలేదు.వాటి శిలాఫలకాలు నేటికి వెక్కిరిస్తున్నాయి. సాధారణ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలు వీటిపైనే గురి పెట్టి ఓట్లు దండుకున్నాయే తప్ప పనులు మాత్రం చేపట్టడం లేదు. ఈసారి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలు మరోసారి ప్రజల్ని నమ్మించే ప్రయత్నం మొదలు పెట్టాయి. మమ్మల్ని గెలిపించండి.. కచ్చితంగా ఈ రెండు పనులు పూర్తి చేస్తామంటూ ప్రజల్ని అభ్యర్థిస్తున్నారు.

గోడ దూకేద్దామా ?



పాలకొల్లు, ఏప్రిల్ 20 : ఎన్నికల వేళ పార్టీలు ఫిరాయించడం, రాత్రికి రాత్రే కండువాలు మార్చివేయడం సహజమే. అయితే ఇప్పుడు నామినేషన్ల ప్రక్రియ మొదలైన తర్వాత పాలకొల్లు నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన పలువురు గోడ దూకేయడానికి సిద్ధంగా ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆది నుంచి పాలకొల్లు అధికార వైసీపీలో నాలుగు స్తంభాల ఆట జరుగుతూనే ఉంది. నాలుగేళ్ళుగా స్థానిక, స్థానికేతరులుగా నాయకులు విడిపోతుంటే, ఆయా నాయకులను అభిమానించే ద్వితీయస్థాయి నాయకులు, కార్యకర్తలు ధర్మ సంకటంలో పడుతూనే ఉన్నారు. ఇప్పుడు తాజాగా పలువురు టీడీపీలోకి వచ్చే అవకాశాలపై ప్రచారం జరుగుతోంది. గతంలో అధికార పార్టీ అభిమానులుగా చలామణి అవుతూ వివిధ కాంట్రాక్ట్ పనులు చేసి చేతులు కాల్చుకున్న వారు కొందరు, తాము అభిమానించే వారు కాకుండా టికెట్ మరొకరికి ఇచ్చారని మరి కొందరూ, సామాజికవర్గ పరంగా మరికొందరూ గోడ దూకుళ్ళకు సిద్ధమవుతున్నట్టుగా ఆ పార్టీ శ్రేణుల్లోనే వినిపిస్తోంది. రెండు దఫాలు మినహా పాలకొల్లు నియోజకవర్గం కాపు సామాజిక వర్గానికి చెందిన వారికే ఎమ్మెల్యే పదవి దక్కింది. ఇప్పుడు వైసీపీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపారు. బీసీ వర్గాలు ఎప్పుడు టీడీపీనే వెన్నంటి ఉంటాయని టీడీపీ వర్గాలు ఆశిస్తుండగా ఈదఫా తమ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అత్యధిక శాతం తమ అభ్యర్థికే పడతాయని వైసీపీ శ్రేణులు ఆశిస్తున్నాయి. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ముందుగానే దుకాణం సర్దివేస్తే మెరుగ్గా ఉంటుందని పలువురు వ్యాఖ్యానించుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.

భైరాగిమఠంలో ముగిసిన నవమి ఉత్సవాలు



చక్రస్నాన పూజల్లో పాల్గొన్న భక్తులు

పెంటపాడు, ఏప్రిల్ 20: నవమి వేడుకల ముగింపు పూజల్లో భాగంగా మండలంలోని కె.పెంటపాడు భైరాగిమఠం గోపాలస్వామి, ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి హోమాలు, ఆలయ సమీపంలో ఉన్న పుష్కరిణిలో గోపాల స్వామికి చక్రస్నాన మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రికి శ్రీపుష్ప యాగోత్సవం జరిపారు. ఆలయ ఫిట్ పర్సన్ ఎ.రవిశంకర్, అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠి పాల్గొన్నారు.

23 నుంచి మావూరమ్మ జాతర



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 20 : స్థానిక బంగారువారి చెరువుగట్టున ఉన్న మావూరమ్మ జాతర ఈనెల 23వ తేదీ నుంచి 27 వరకు జరుపుతున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శంకరాపు శ్రీనివాసరావు, సభ్యులు సరిడె ధనుంజయ, కర్నేన గౌరు నాయుడు, దొమ్మేటి వెంకట్రావు, మందం శ్రీను, రౌతు అచ్యుత రావు, ఎం.సాయి, భార్గవ, ఉమ శనివారం విలేకర్లకు తెలిపారు. అమ్మవారి జాతరలో గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, కోర గేదెలు, బ్యాండ్ మేళాలు, ఆసాదుల విన్యాలతో జాతర నిర్వహించనున్నామని తెలిపారు. 25వ తేదీ రాత్రి అమ్మవారికి లక్ష మల్లెపూల పూజ నిర్వహించనున్నట్టు తెలిపారు.

అభివృద్ధి..సంక్షేమమే అజెండా: అంజిబాబు



వీరవాసరంలో ప్రచారం చేస్తున్న అంజిబాబు

భీమవరం టౌన్, ఏప్రిల్ 20: 'అభివృద్ధి... సంక్షేమమే జనసేన-తెలుగుదేశం-బీజేపీ అజెండా. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ఏకైక లక్ష్యం. ఐదేళ్ల పాలన చూశారు. కక్షలు, వేధింపులు. భీమవరం నియోజకవర్గం వెనుకపడిపోయింది. అన్ని రంగాల్లోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది' అంటూ కూటమి అభ్యర్థి పులపర్తి అంజిబాబు హామీ ఇచ్చారు. వీరవాసరం మండలంలో శనివారం ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వస్తే అభివృద్ధి సాధ్యపడుతుందంటూ అంజిబాబు ప్రజలను చైతన్య పరిచారు. వీర వాసరం మండలంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామంటూ హామీ ఇచ్చారు. భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఇవ్వండి. రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా పనిచేసి నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశాను. ప్రజలంతా అభివృద్ధిని గుర్తించారు. గడచిన ఐదేళ్లలో భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి లేదు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారన్నారు.





కేక్ కట్ చేస్తున్న ఆరిమిల్లి దంపతులు... రెండవ వార్డులో గ్యాస్ సిలిండర్ల వాహనం నడుపుతున్న ఆరిమిల్లి

చంద్రబాబు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలి

తణుకు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా ఉండాలని కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకాంక్షించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేసి, మిఠాయిలు పంచారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు, ఒమ్మి రాంబాబు, సూరా సాహెబ్, తాతపూడి మారుతీ రావు, బొంతు శ్రీను, గుమ్మళ్ళ హనుమంతు పాల్గొన్నారు.

• కూటమి ప్రభుత్వం రాగానే మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని రెండో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానికులు పలు సమస్యలను ఏకరవు పెట్టారు. సమస్యలు పరిష్కారం కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలపై వివరించారు.

19వ వార్డులో కృష్ణ తులసి ప్రచారం

పట్టణంలోని 19వ వార్డులో ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాధాకృష్ణను గెలిపించుకుంటామని మహిళలు ముక్త కంఠంతో చెప్పడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. అనేక ప్రాంతాల్లో మహిళలు కృష్ణతులసికి హారతులిచ్చారు.

జగన్ ఎస్సీల నమ్మక ద్రోహి : నిమ్మల



పాలకొల్లులో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 20: జగన్ ఎస్సీలను నమ్మించి అధికారంలోకి వచ్చాక దగా, మోసం, నమ్మక ద్రోహానికి పాల్పడ్డాడని పాలకొల్లు ఉమ్మడి అభ్యర్థి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఆయన శనివారం పాలకొల్లు పట్టణంలోని 20, 21వ వార్డుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని సకల సౌకర్యాలతో నిర్మించగా జగన్ ప్రభుత్వం కనీసం భవనానికి రంగులు కూడా వేయలేకపోయిందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఎస్సీలకు చెందిన 27పథకాలను రద్దుచేసిందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, పట్టణ అధ్యక్షుడు శిడగం సూరి, వార్డు ఇనిచార్జ్ ధనాని సూర్యప్రకాష్, పొట్నూరి అప్పన్న పాల్గొన్నారు.

రామానాయుడికి ప్రజలే కుటుంబం: సూర్యకుమారి

పోడూరు, ఏప్రిల్ 20: పాలకొల్లు నియోజకవర్గ ప్రజలే కుటుంబమని అనునిత్యం ప్రజల కోసం ఆలోచించే ఎమ్మెల్యే రామానాయుడును మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి కోరారు. జిన్నూరు గ్రామంలో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీడైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ కార్యదర్శి దాసరి రత్నరాజు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ కార్యదర్శి పాలవలస తులసీరావు, రాష్ట్ర టీడీపీ శెట్టిబలిజ సాధికారత డైరెక్టర్ గుబ్బల శ్రీరామ్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 20: వైసీపీ అవినీతి పాలన అరికట్టాలంటే కూటమి గెలుపు సాధించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. రూరల్ మండలం ఆరుగొలను గ్రామానికి చెందిన అడపా వెంకన్న తదితరులు శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వలవల బాబ్జి సమక్షంలో టీడీపీలో చేరగా బాబ్జి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

కళాకారుడు పులఖండ మృతి



పులఖండ

భీమవరం అర్బన్, ఏప్రిల్ 20: రంగస్థల కళాకారుడు, నంది నాటక అవార్డు గ్రహీత, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సభ్యులు పులఖండ ఉగాది శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. వయసు 58 సంవత్సరాలు. ఆయనకు భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. సుమారు 300 నాటక పరిషత్తుల పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతు మృతి చెందారు. ఆయన మృతి పట్ల పట్టణ కళాకారులు ఎం.సీతారాం ప్రసాదు, గొన్నబత్తుల మల్లేశ్వరరావు, రాయప్రోలు భగవాన్, గుండా రామకృష్ణ, చెరుకువాడ రంగసాయి తదితరులు సంతాపం తెలిపారు.

ఇంకా తేలని ఆచంట కాంగ్రెస్ అభ్యర్థి

ఆచంట, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్‌ల ఘట్టం ప్రారంభమైంది. ఈ నెల 25 వరకే నామినేషన్‌లు వేయడానికి అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇంకా ఆచంట నుంచి పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించలేదు. ముందుగా ఆచంట సీపీఎంకి ఇస్తారని ప్రచారం జరిగినప్పటికి ఇప్పటికే సీపీఎం పోటీ చేసే స్థానాలు ఖరారు కావడంతో కాంగ్రెస్‌కే అవకాశం వచ్చింది. టిక్కెట్ కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఎవరికి ఇస్తారోనని ఎదురు చూస్తున్నారు. టిక్కెట్ కోసం సుమారు నలుగురు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

శ్రీవారి హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ, ఏప్రిల్ 20: సిద్ధాంతం వశిష్ట గోదావరి తీరాన కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.16,207 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కనుమూరి జానకి రామరాజు తెలిపారు. దేవస్థానం అధికారి మన్నె శ్రీనివాస్ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించగా 13 వారాలకు గాను ఈ ఆదాయం సమకూరిందన్నారు.

ఫైర్ సిబ్బంది సేవలు భేష్



పాలకొల్లులో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 20 : ప్రకృతి సహజమైన ప్రమా దాలు, అగ్ని ప్రమా దాలు, జల ప్రమా దాల్లో తమ ప్రాణా లను కూడా లెక్కచే యకుండా పనిచేసే అగ్ని మాపక సిబ్బంది సేవలను ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని మున్సి పల్ కమిషనర్ బి.విజయ సారథి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఫైర్ స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమానికి కమిషనర్ విజయ సారథి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమానికి సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకీరామ్ అధ్యక్షత వహించారు. డీఎస్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు జి.రామ్మోహన్‌రావు ప్రసంగించారు. కార్యక్రమంలో లీడ్ ఫైర్‌మెన్ కె. శ్రీనివాస్, ఎం.శ్రీను, పి.రమాకాంత్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: వారం రోజులుగా పట్టణంలో జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు గౌతమి కాలేజీలో జరిగిన అవగాహన కార్యక్రమానికి కమిషనర్ వెంకటేశ్వరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్యాస్, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఫైర్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

జనేసేనలో చేరిన వైసీపీ నేత మారం

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 20: రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి కి జే.టాక్స్ కడితే తాడేపల్లిగూడెంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కే.టాక్స్ కట్టాల్సి వస్తుందని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. ఆర్యవైశ్య సంఘం తాడేపల్లిగూడెం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు, వైసీపీ సీనియర్ నాయకుడు మారం వెంకటేశ్వరరావుతో పాటు మారం గిరీష్, కొడాలి సత్యనారాయణ తదితరులు సుమారు 500 మంది బొలిశెట్టి సమక్షంలో జనసేలో చేరారు.









భీమవరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు.. నరసాపురంలో పొత్తూరి రామరాజుకి కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు.. తాడేపల్లిగూడెంలో కేక్ కట్ చేసిన వలవల బాబ్జి, బొలిశెట్టి.. ఉండిలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఘనంగా చంద్రబాబు జన్మదినం
కేక్ కట్ చేసిన పార్టీ శ్రేణులు

నరసాపురం టౌన్, ఏప్రిల్ 20: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకను శనివారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు కట్ చేశారు. ఇటు మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆధ్వర్యంలో రాయపేటలోని ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. టీడీపీ తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజ్యలక్ష్మి అధ్వర్యంలో మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలోని గంగాలమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

భీమవరం అర్బన్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సంపద సృష్టించడంలో చంద్రబాబుకి తప్ప ఎవరికి సాధ్యపడదని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. భీమవరం టీడీపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలోను, ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం శనివారం నిర్వహించారు. టీడీపీ జనసేన బీజేపీ నాయకులు ముందుగా చంద్రబాబు పుట్టినరోజు కేకును కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు చనమల చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర నాయకులు మెరగాని నారాయణమ్మ, పట్టణ నాయకులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడురి సుబ్బారావు, రేవు వెంకన్న, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమాబేగం పాల్గొన్నారు.

ఉండి: ఉండి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకను గ్రామ పార్టీ అధ్యక్షుడు కాగిత బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్‌ను కట్‌చేశారు. జిల్లా తెలుగుదేశం పార్టి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, క్యాంప్‌బెల్ మాజీ చైర్మన్ కునుకు శ్రీనివాస్, కందుల బలరాం, మాజీ జడ్పీటీసీ కాగిత మహంకాళి పాల్గొన్నారు.

ఆకివీడు: చంద్ర బాబునాయుడు జన్మదినోత్సవం సందర్భంగా శనివారం టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మొగల్తూరు: పట్టణ టీడీపీ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు ఆధ్వర్యంలో మొగల్తూరు జాతీయ రహదారిపైన చంద్రబాబు జన్మదిన కేకట్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మోకా విజయబాస్కరరావు, అంద్రాజు రామన్న, వెలిది పుల్లారావు, ముక్తేశ్వరరావు, కడలి చంటి, వేంద్ర నాగరాజు, కొల్లాటి హరికృష్ణ పాల్గొన్నారు. మరోవైపు మొగల్తూరు మండల టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

పెనుగొండ: టీడీపీ నాయకులు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను పెనుగొండ పట్టణ టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కటికిరెడ్డి నానాజీ, మండా ప్రసాద్, వేంద్ర రాము, మద్దింశెట్టి వెంకటేష్, పులుగోరు రవి కుమార్ పాల్గొన్నారు.

ఆచంట: ఆచంటలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథిగా పితాని తనయుడు వెంకట్‌తో పాటు జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, గొడవర్తి శ్రీరాములు, కేతా మురళి, మొనవర్తి సుబ్బారావు, నెక్కంటి ప్రభాకరరావు, గణేషుల సత్తిబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: పార్టీ కార్యాలయంలో వలవల బాబ్జి, కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం శశి కళాశాల ప్రాంగణంలో వలవల బాబ్జి, బొలిశెట్టి రాజేష్, ఈతకోట తాతాజీ కేక్ కట్ చేశారు.

న్యాయశాఖ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

భీమవరం క్రైం, ఏప్రిల్ 20 : న్యాయశాఖ సిబ్బందికి జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డా.కె జేరుష సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో ఆరోగ్యపరంగా తీసుకోవల్సిన ముందుజాగ్రత్తలను వివరించారు. తరచూ మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం, షుగర్ సాల్ట్ కలిపిన నీటిని తీసుకుంటూ మసాలాలకు దూరంగా ఉండాలన్నారు. ఎండలో బయటికి వెళ్ళినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. డయాబెటిక్, గుండె ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వడదెబ్బకు గురైనప్పుడు వారిని చల్లని ప్రదేశంలో ఉంచడం మరువకూడదన్నారు.

నరసాపురం టౌన్: ఎండకాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం కోర్టు ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎండలో చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్ళకూడదన్నారు. ముక్కు, తల, చెవ్వులకు కాటన్ దుస్తువులు ధరించి బయటకు రావాలన్నారు. మంచినీళ్లు ఎక్కువగా తాగాలని డాక్టర్ పి.సోని కోర్టు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆనంతరం న్యాయవాదులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులందించారు. జిల్లా ఆదనపు న్యాయమూర్తి పి. విజయదుర్గా, న్యాయమూర్తులు ఆర్.వరలక్ష్మి, కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దానయ్యనాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఆచంట, ఏప్రిల్ 20: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చు విషయంలో అవగాహన ఉండాలని, అదే సమయంలో ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మోహల్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం ఆచంట వచ్చిన ఆయన ఎన్నిలక ఖర్చుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి కార్యాచరణ రూపొందించాలని, సమస్యాత్మక సున్నిత ప్రాంతాలపై నిఘా పెట్టాలని, ఖర్చుల పరిశీలనపై మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శుక్రవారం జరిగిన నామినేషన్‌లో పార్టీలు నిర్వహించిన ర్యాలీలు, వీడియోలను ఈ సందర్భంగా ఆర్‌వో వి. స్వామినాయుడు అబ్జర్వర్‌కు వివరించారు.

ఎన్నికల ప్రచారాలపై నిఘా: ఆర్వో స్వామి నాయుడు

ఆచంట, ఏప్రిల్ 20: నియోజకవర్గ స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల ప్రచారాలుపై సూక్ష్మ స్థాయిలో నిఘా పెట్టాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామి నాయుడు అన్నారు. నియోజకరవర్గంలో నిఘా బృందాలుగా పని చేస్తున్న 11 వీడియోబందాలు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో సమావేశం నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరింత పటిష్టంగా విధులను చేపట్టవలసి ఉందన్నారు. లిక్కర్ అమ్మకాలపై కూడా నిఘా పెట్టామని, గత ఏడాది ఇదే రోజున ఎంత లావాదేవీలు జరిగాయో షాపుల వారీగా ఏరియా వారీగా గణాంకాలు తనిఖీ చేస్తున్నామన్నారు.

ఆచంటలో నామినేషన్‌లు నిల్

ఆచంట, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ పక్రియలో భాగంగా శుక్రవారం ఆచంట నియోజకవర్గంలో ఎటువంటి నామినేషన్‌లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు, ఏప్రిల్ 20: వచ్చే నెల 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, నాల్గో అదనపు జిల్లా న్యాయాధికారి డి. సత్యవతి తెలిపారు. అదాలత్‌లో రాజీ పడతగిన సివిల్, క్రిమినల్, ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కరించి, ఇరు పక్షాల మధ్య రాజీ చేస్తారని తెలిపారు. వడదెబ్బ తగిలితే తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యులతో కోర్టు ఆవరణలో శిబిరం ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లును పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆచంట, ఏప్రిల్ 19: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఆచంట మండలంలోని ఆచంట, వేమవరం, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, అయోధ్యలంక, పోడూరు మండలంలోని వద్దిపర్రులో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు నరసాపురం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సురేష్ కుమార్ తెలిపారు.

నీటి కుండీలు అందజేత

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 20 : రోటరీ క్లబ్ పట్టణంలోని మూగ జీవాలు దాహార్తి తీర్చేందుకుగానూ రూ.10వేలు విలువైన 50 నీటి కుండీలను పశుసంవర్థకశాఖ అధికారులకు అందజేశారు. రోటరీ అధ్యక్షుడు పెనుమాక రామోహ్మన్‌రావు ఆర్థిక సహాయంతో సేవ్ యానిమల్ పేరుతో కుండీలు సమకూర్చారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇమ్మిడి రాజేష్, పొతాబత్తుల సత్యనారాయణ, జవ్వాది కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడిప్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 20: తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో 15 రోజులకు గాను భీమవరం-గణపవరం, ఆచంట, జంగారెడ్డిగూడెం రూట్‌లకు శనివారం లక్కీడిప్ తీశారు. అసిస్టెంట్ మేనేజర్ ఏడీఎల్ సుధారాణి నిర్వహించారు. యూనియన్ నాయకులు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డి.మహేశ్వరరావు

మొగల్తూరు, ఏప్రిల్ 20: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు సూచించారు. శనివారం మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించి డాక్టర్లు లక్ష్మీ పార్వతి, దినేష్‌లతో మాట్లాడారు. అనంతరం మొగల్తూరు 1వ గ్రామ సచివాలయ పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

23న సదస్సు

నరసాపురం టౌన్, ఏప్రిల్ 20: పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఈనెల 23న సంక్షోభంలో భారత్ ఆర్థిక, రాజకీయ మూలాలు అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. ఎమ్మెల్సీ ఈ.వెంకటేశ్వరావు, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్ విచ్చేస్తున్నట్లు అఖిలభారత న్యాయవాదుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పూరిళ్ల శ్రీనివాస్ తెలిపారు

సబ్ జైల్ సందర్శన

నరసాపురం టౌన్, ఏప్రిల్ 20: పట్టణంలోని సబ్‌జైల్‌ను శనివారం అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సందర్శించారు. జైలులో ఉన్న ముద్దాయిల కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని ముద్దాయిలకు న్యాయసేవా సంస్థ ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందన్నారు. అనంతరం ముద్దాయిలకు అందుతున్న భోజనం, వంటశాల, గిడ్డంగిని తనిఖీ చేశారు. జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, న్యాయవాది శిరీష పాల్గొన్నారు.

రేషన్ డీలర్ ప్రసాద్ మృతి



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 20 :పట్టణంలోని మారుతీ థియేటర్ పక్కవీధికి చెందిన రేషన్ డిపో డీలర్ బొమ్మగాని మణి ప్రసాద్ (70) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు 40 ఏళ్ళుగా కోటా డీలర్‌గా ఉన్న ప్రసాద్‌కు కోట కొట్టు ప్రసాద్ అని పిలుస్తారు. ప్రసాద్ మృతికి డీలర్ల సంఘం అధ్యక్షుడు మండెల బాబూ రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శి జె.విష్ణుమూర్తి, కార్యవర్గ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

చోరీ కేసులో సొత్తు స్వాధీనం.. దొంగకు జైలు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 20 : పట్టణంలోని 7వ వార్డులో నివసిస్తున్న వింజరపు కిషోర్ కుమార్ నివాసంలో గత ఏడాది ఆగస్టు 12వ తేదీ రాత్రి దొంగలు పడి సుమారు 7.5 కాసుల బంగారు వస్తువులు దొంగిలించుకుపోయిన నేరంలో దొంగకు కోర్టులో శుక్రవారం 6మాసాలు జైలు విధించి నట్టు పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాస్ తెలిపారు. కిషోర్‌కుమార్ పిర్యాదు మేర కు దర్యాప్తు చేసి చెన్నూరి శంకర్ కుమారుడు ప్రకాష్ అలియస్ రాఖీ అలియాస్ సంజు (24) అనే నిందితుడిని అరెస్టు కేసి చోరీ సొత్తు 7.5 కాసులు బంగారం స్వాధీనం చేసుకున్నారు. నేరం రుజువుకావడంతో కోర్టు శిక్ష విధించింది.

చేతివృత్తుల ఐక్యవేదిక అభ్యర్థిగా సూర్య భాస్కరరావు

పెనుమంట్ర, ఏప్రిల్ 20 : జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ ఆచంట నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అల్లాడ సూర్య భాస్కర్ రావు పోటీ చేయనున్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 23న ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలుచేస్తున్నట్లు తెలిపారు.

ఆంగ్ల నృత్య నాటిక పోటీలు



భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 : భీమవరం భారతీయ విద్యాభవన్స్ స్కూల్‌లో ఆంగ్ల సాహిత్య వారోత్సవాలు సందర్భంగా శనివారం నాడు ఇంగ్లీష్‌లో నృత్య నాటికలు, చిన్న స్కిట్స్ ఆంగ్లపద్యాల పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్‌వి రమాదేవి, భవన్ సంచాలకులు డా.బీవీ శేషగిరిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీకి బొద్దాని రాజీనామా

తణుకు, ఏప్రిల్ 20: వైసీపీ సీనియర్ నాయకుడు, తణుకు పట్టణ వంశీ కృష్ణ యాదవ సంఘం గౌరవాధ్యక్షుడు బొద్దాని రామకోటేశ్వరరావు శనివారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడికి, స్థానిక ఎమ్మెల్యేకు పంపానన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లపై హర్షం



భీమవరం టౌన్, ఏప్రిల్ 20 : భారత ఎన్నికల కమిషన్ ఓటింగ్ శాతం పెంచాలనే సంకల్పంతో దివ్యాంగులకు, 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఓటు వేసేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పిస్తున్నదని సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగం చేసుకునేలా చేయడం శుభ పరిణామమని అన్నారు. దీనిపై దివ్యాంగులు హర్షం ప్రకటిస్తూ క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రిటైర్డు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సీతారామరాజు, వెంకటరాజు, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు నరికడమిల్లి లక్ష్మణ రావు, దుర్గారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు నేర్చుకోవాలి

కాళ్ళ, ఏప్రిల్ 20 : విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు నేర్చుకోవాలని డీఈవో వెంకటరమణ అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐక్యనేషనల్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుతో పాటు నైతిక విలువలు, సాంస్కృతిక, ఆటలతో నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగి ఉండాలని అన్నారు. అనంతరం ఐక్యఫౌండేషన్ సభ్యులు డీఈవోను సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలదేవి, ఫౌండేషన్ ఛైర్మన్ ముదునూరి శివరామరాజు, సెక్రటరీ సురేష్‌చంద్ర, భీమవరం సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఏ రవివర్మ, ఎంఈవో కనకరాజు పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయాలపై నిరంతర నిఘా



అధికారులతో సమీక్షిస్తున్న వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా, జేసీ ప్రవీణ్ ఆదిత్య

ఉండి, ఏప్రిల్ 20:ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల వ్యయాలపై నిరంతరం నిఘా ఉంచాలని నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు పియూష్ శుక్లా అన్నారు. శనివారం ఉండి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో పోటీచేసే అభ్యర్థుల వ్యయాలపై పరిశీలకుడు పియూష్ శుక్లా, జిల్లా జాయింట్ కలెక్టరు, ఆర్వో ప్రవీణ్ ఆదిత్యతో సమీక్ష నిర్వహించారు. పియూష్ శుక్లా, ప్రవీణ్ ఆదిత్యలు మాట్లాడుతూ సార్వత్రి ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల వ్యయాలను పక్కాగా లెక్కించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోటీలో వున్న అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతీ పైసా ఎన్నికల వ్యయంలోకే వస్తుందన్నారు. పెయిడ్ న్యూస్‌కు సంబందించిన వ్యయ వివరాలను బి-16ద్వారా, సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.14లక్షలు

మొగల్తూరు, ఏప్రిల్ 20: ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 64 రోజులకు గానూ రూ.14,63,735 ఆదాయం లభించినట్టు ఈవో డి.రామ కృష్ణంరాజు తెలిపారు. ఈలెక్కింపులో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన ప.గో.జిల్లా, వీరవాసరం (మం), భీజిపాలెం, తోలేరు పోస్టు, రాజుల గరువు గ్రామం కాపురస్తులైన **జంపన సత్యనారాయణ రాజు** గారి కుమారుడు **జంపన సూర్యనారాయణ రాజు గారు** నాకు యిచ్చిన సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నా క్లయింటు ది.16-04-2024 సం॥తేదీన తన యింటి నుండి జిరాక్స్ కొరకు వీరవాసరంలోని జిరాక్స్ షాపుకు వెళ్తుండగా తన దస్తావేజు నెం: 5282/2006 భోగాపురం SRO ది.09-11-2006 తోగల ఒరిజినల్ లింకు దస్తావేజు మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవ్వరికైనా సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియపర్చవలసిందిగా ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

మానవరాజు గోపాలకృష్ణంరాజు
అడ్వకేట్, డోర్ నెం. 24-12-1/1,
పెద్దార వారి వీధి, శ్రీరామపురం,
భీమవరం -2, ప.గో॥జిల్లా.
సెల్: 98484 04029

భూమి సేద్యపు హక్కునకు టెండరు-కం-బహిరంగ వేలం పాట ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, యనమదుర్రు గ్రామంలో గల శ్రీ శక్తీశ్వరస్వామి వారి దేవస్థానమునకు చెందిన [illegible] జి.వో.యమ్.యస్.నెం.379 రెవెన్యూ (ఎండోమెంట్స్) డిపార్టుమెంటు తేది. 11-03-2003 మరియు జి.వో.యమ్.యస్.నెం.866 రెవెన్యూ (ఎండోమెంట్స్) డిపార్టుమెంటు తేది. 08-08-2003 అనుసరించి టెండరు-కమ్-బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

దేవస్థానం పేరు	భూమియున్న గ్రామం మరియు మండలం	[illegible]	[illegible]	[illegible]	కౌలు కాలపరిమితి	వేలం జరుగు తేది మరియు సమయం	వేలం జరుగు ప్రదేశము
శ్రీ శక్తీశ్వర స్వామి వారి దేవస్థానం, యనమదుర్రు గ్రామం.	పల్లం భూమి, [illegible] గ్రామం, భీమవరం మండలం.	26	6-67	రూ. 7000/-	2024-25 నుండి 2026-27 వరకు 3సం॥ [illegible]	ది.29-04-2024 సోమవారం ఉదయం గం॥10-00 [illegible]	[illegible]
	పల్లం భూమి, [illegible] గ్రామం, భీమవరం మండలం.	169	3-00	రూ. 3000/-	2024-25 నుండి 2026-27 వరకు 3సం॥ [illegible]	ది.29-04-2024 సోమవారం ఉదయం గం॥11-00 [illegible]	[illegible]

ముఖ్య పాట షరతులు : [illegible]

యనమదుర్రు
తేది : 18.04.2024

[illegible]
కార్యనిర్వహణాధికారి
శ్రీ శక్తీశ్వరస్వామివారి దేవస్థానము